శ్రీ శివాపరాధ క్షమాపణ స్తోత్రమ్ - భావార్థముతో.



సేకరణ: కిరణ్ టైప్ ఇనిస్టిట్యూట్, 41-1/8-13A.,
గౌతమీనగర్,3వ లైను, కృష్ణలంక, విజయవాడ-520 013.
https://madhirafamily.wordpress.com/

శ్రీ శంకరాచార్య విరచితం

శ్రీ శివాపరాధ క్షమాపణ స్తోత్రమ్

- భావార్థముతో. -

01.ఆదౌ కర్మ ప్రసంగాత్కలయతి కలుషం
మాతృకుక్షౌ స్థితం మాం।
విణ్మూత్రా మేధ్య మధ్యే క(క్వ)థయతి నితరాం
జాఠరో జాతవేదాః।
యద్యద్వై తత్ర దుఃఖం వ్యథయతి నితరాం
శక్యతే కేన వక్తుం
క్షన్తవ్యో మేఽపరాధః శివ శివ శివ భోః
శ్రీ మహాదేవ శంభో॥

ఓ శివా! తల్లి గర్భమునందున్న నన్ను పూర్వజన్మలో చేసిన పాప కర్మ చుట్టుకొను చున్నది. అపవిత్రములైన మలమూత్రముల మద్యనున్న నన్ను తల్లి కడుపులో నున్న జఠరాగ్ని ఉడకబెట్టు చున్నది. గర్భము నందున్నప్పుడు ఏ ఏ దుఃఖము పీడించునో దానిని వర్ణించుట ఎవడి తరము? శ్రీ మహాదేవా! శంభో! నా అపరాధమును క్షమించుము.

తండ్రీ! ఈశ్వరా! నేను పూర్వజన్మములలో చేసిన పాపములు ఇప్పుడు, తల్లి గర్భములో ఉన్న నన్ను పూర్తిగా చుట్టు ముట్టాయి. దుర్గంధ పూరితమైన మల మూత్రములతో అలమటిస్తున్న నన్ను ఒకవైపు ఆకలి బాధిస్తున్నది. తల్లి గర్భములో బిడ్డ పడే బాధ వర్ణనాతీతము. మహాదేవా, శంభో, నా అపరాధములను మన్నించి క్షమింపుము.

02. బాల్యే దుఃఖాతి రేకాన్మలలులితవపుః
స్తన్యపానే పిపాసుః
నో శక్తశ్చేన్ద్రియేభ్యో భవ గుణ(మల)జనితాః
జన్తవో మాం తుదన్తి।
నానారోగాతి దుఃఖాద్రుదిత పరవశః
శంకరం న స్మరామి
క్షన్తవ్యో మేఽపరాధః శివ శివ శివ భోః
శ్రీ మహాదేవ శంభో॥

పసితనము నందు మిక్కిలి దుఃఖము ననుభవించి, మలములో దొర్లుచూ పాలుత్రాగదలచి ఇంద్రియములను కదలించుటకు కూడ శక్తి లేని వాడనైతిని. మలమునందు పుట్టు పురుగులు నన్ను పీడించుచున్నవి. నానా రోగములచే దుఃఖితుడనై పరాధీనుడనై శంకరుని స్మరించలేకుంటిని. శ్రీ మహాదేవా! శంభో! నా అపరాధమును క్షమించుము.

పసి వయసులో మల మూత్రములలో పడి అటూ ఇటూ దొర్లుతూ, ఇంద్రియములపై స్వాధీనము లేక , పాలు త్రాగటానికి కూడా శక్తిలేని వాడనైతిని. మల మూత్రములలో జనించిన పురుగులు నన్ను బాధించినవి. ఈ స్థితిలో నేను పరాధీనుడను కదా. అందువలన నిన్ను స్మరించలేక పోయిన నా అపరాధమును ఓ మహా దేవా, శంభో మన్నించి కరుణించుము.

03. ప్రౌఢోహం యౌవనస్థో విషయ విషధరైః
పంచభిర్మర్మసంధౌ
దష్టో నష్టో వివేకః సుతధన యువతిస్వాద సౌఖ్యే నిషణ్ణః।

శైవే చిన్తావిహీనం మమ హృదయ
మహో మాన గర్వాధిరూఢం
క్షన్తవ్యో మేఽపరాధః శివ శివ శివ భో
శ్రీ మహాదేవ శంభో॥

నేను యువకుడనైనంతనే సుఖముల నాశించు పంచేంద్రియములనే సర్పములచే మర్మస్థానము నందు కరువబడి తిని. మంచి చెడులను తెలుసుకొను విచక్షణాజ్ఞానము నశించినది. పుత్ర, ధన, యువతి సుఖముల ననుభవించుటలో మునిగితిని. అభిమానము నిండి గర్వించిన నా హృదయము శివధ్యానము విడిచినది. శ్రీమహాదేవా! శంభో! నా అపరాధమును క్షమించుము.

నా యౌవనావస్థలో నా పంచేంద్రియములు అనబడే నాగులు సుఖములను కోరుకునే నా మర్మస్థానమునందు కాటువేసినవి. మంచి చెడుల విచక్షణా జ్ఞానమును కోల్పోయితిని. ధన, స్త్రీ, పుత్ర వ్యామోహము నా చేత ఈశ్వర ఆరాధనను మరిపింపచేసినది. ఓ మహా దేవా! శంభో! నా అపరాధమును మన్నించి క్షమింపుము.

04. వార్ధక్యే చేన్ద్రియాణాం వికలగతి మతశ్చాధి
దైవాదితాపైః
ప్రాప్తై రోగై ర్వియోగైః ర్వ్యసనకృశతనోర్ జ్ఞప్తి
హీనం చ దీనమ్।
మిథ్యామోహాభిలాషై ర్భ్రమతి మమ మనో
ధూర్జటేర్ధ్యా నశూన్యం
క్షన్తవ్యో మేఽపరాధః శివ శివ శివ భో
శ్రీ మహాదేవ శంభో॥

ముసలి తనమునందు ఇంద్రియములు పనిచేయక తాపత్రయముచే సంప్రాప్తించిన రోగములతోనూ, బంధుజన వియోగములతోనూ, నా శరీరము కృశించిపోయినది. మనస్సు జ్ఞాపక శక్తిని కోల్పోయి దీనమై అసత్యములైన ఆశలతో భ్రమించుచూ పరమేశ్వరుని ధ్యానించుట లేదు. శ్రీ మహాదేవా! శంభో! నా అపరాధమును క్షమించుము.

వార్ధక్యము నందు నా ఇంద్రియములు స్వాధీనము తప్పినవి. అనేక రోగములు సంప్రాప్తించినవి. బంధు, మిత్రులు గతించారు. శరీరము డస్సిపోయినది. జ్ఞాపక శక్తిని కోల్పోయిన నేను నీ ధ్యానమును మరచితిని. ఓ మహాదేవా, శంభో, నా అపరాధమును మన్నించి క్షమింపుము.

05. స్నాత్వా ప్రత్యూషకాలే స్నపనవిధివిధౌ
నాహృతం గాఙ్గతోయం
పూజార్థం వా కదాచిత్ బహుతర గహనే
ఖణ్డ బిల్వీదళం వా।
నానీతా పద్మమాలా సరసి వికసితా
గన్ధ పుష్పైస్త్వదర్థం
క్షన్తవ్యో మేఽపరాధః శివ శివ శివ భోః
శ్రీ మహాదేవ శంభో॥

ఓ శివా! ప్రాతః కాలమునందే స్నానము చేసి నీ అభిషేకం కోసమై నేనెన్నడూ గంగాజలము తీసుకురాలేదు. నిన్ను పూజించుటకై దట్టమైన అడవికి పోయి ముక్కలుకాని మారేడు దళమును ఎప్పుడూ తేలేదు. నిన్నలంకరించుటకై సరస్సునందు వికసించి, పరిమళములు వెదజల్లుచున్న పద్మములమాల తీసుకురాలేదు. శ్రీ మహాదేవా! శంభో! నా అపరాధమును క్షమించుము.

తండ్రీ! బ్రాహ్మీ ముహూర్తమున నిద్ర లేచి, నేను శివాభిషేకమునకై గంగా జలమును ఎన్నడూ తేలేదు. నీ పూజకై ఛిద్రము కాని మారేడు దళములను ఎన్నడూ సేకరించి తేలేదు. నీ అలంకరణకోసం చెరువులలోని పద్మములను ఏనాడూ తీసుకు రాలేదు. ఓ మహాదేవా! శంభో! నా అపరాధమును మన్నించి క్షమింపుము.

06. దుగ్ధై ర్మధ్వాజ్యయుక్తైః దధిగుడసహితైః స్నాపితం
నైవ లిఙ్గం
నోలిప్తం చన్దనాద్యైః కనకవిరచితైః పూజితం
న ప్రసూనైః।
ధూపైః కర్పూరదీపైః వివిధ రసయుతై ర్నైవ
భక్ష్యోపహారైః
క్షన్తవ్యో మేఽపరాధః శివ శివ శివ భోః
శ్రీ మహాదేవ శంభో॥

ఓ శివా! పాలతో, తేనెతో, నేతితో, పెరుగుతో, బెల్లముతో నీ లింగమును నేను అభిషేకించలేదు. చందనము మొదలైన సుగంధ ద్రవ్యములు పూయలేదు. బంగారు పూలతో పూజించలేదు. ధూపములతో, కర్పూరముతో, దీపములతో నిన్ను అర్చించలేదు. వివిధములైన రుచులు కల పిండి వంటలతో నీకు నైవేద్యము పెట్టలేదు. శ్రీ మహాదేవా! శంభో! నా అపరాధమును క్షమించుము.

ఈశ్వరా! పంచామృతములైన – పాలు, తేనె, నెయ్యి, పెరుగు, బెల్లములతో నీ లింగమునకు ఎప్పుడు అభిషేకము చేయలేదు. చందనము వంటి సుగంధ ద్రవ్యములను నీకు పూయనేలేదు. సువర్ణ పుష్పములతో పూజ చేయలేదు. ధూప, దీప కర్పూరములతో అర్చించనే లేదు. రుచికరమైన పిండి వంటలు నైవేద్యము పెట్టలేదు. ఓ మహాదేవా! శంభో! నా అపరాధమును మన్నించి కరుణించుము.

07. నోశక్యం స్మార్తకర్మ ప్రతిపదగహనే
ప్రత్యవాయా కులాఢ్యే
శ్రౌతే వార్తా కథం మే ద్విజకులవిహితే
బ్రహ్మ మార్గానుసారే।
తత్త్వేజ్ఞాతే విచారే శ్రవణ మననయోః
కిం నిధిధ్యాసితవ్యం
క్షన్తవ్యో మేఽపరాధః శివ శివ శివ భోః
శ్రీ మహాదేవ శంభో॥

ఓ శివా! ప్రతిపదము అర్థముకానిదీ, ప్రాయశ్చిత్తముతో నిండినదీ, అగు కర్మమార్గము నందు స్మార్తపూజా కర్మను ఆచరించుట నాకు శక్యము కాదు. బ్రహ్మ మార్గము ననుసరించు వారిచే చేయదగిన శ్రౌతకర్మ నాకెట్లు సాధ్యమగును? శ్రవణ మననములు తెలుసుకొనక నిదిధ్యాసమెట్లు కలుగును? శ్రీ మహాదేవా! శంభో! నా అపరాధమును క్షమించుము.

ఈశ్వరా! నా వంటి అజ్ఞానికి అర్థముకాని పదములతో ఉండి, ప్రాయశ్చిత్తము ఆచరించవలసిన స్మార్త పూజ నే నెట్లు ఆచరించగలను.బ్రహ్మ మార్గములో పండితులు చేయు కర్మాచరణ నాకు సాధ్యమా. శ్రవణము, మననము చేయలేని నేను ధ్యానమునందు దృష్టి ఎట్లు నిలుపగలను. ఓ మహాదేవా! శంభో! నా అపరాధమును మన్నించి క్షమింపుము.

08. ధ్యాత్వా చిత్తే శివాఖ్యం ప్రచురతరధనం నైవ
దత్తం ద్విజేభ్యో
హవ్యం తే లక్షసంఖ్యైః హుతవహవదనే
నార్పితం బీజమంత్రైః।

నో తప్తం గాంగాతీరే వ్రతజప నియమైః
రుద్రజాప్యం న జ(ప్త)ప్యం
క్షన్తవ్యో మేఽపరాధః శివ శివ శివ భోః
శ్రీ మహాదేవ శంభో॥

ఓ శివా! "శివ" అను నామమును ధ్యానించి మిక్కిలిగా దానము చేయలేదు. లక్షలకొలది బీజమంత్రములతో హోమము చేయలేదు. వ్రతములతో, జపముతో, నియమముతో గంగా తీరమునందు తపస్సు చేయలేదు. జపించవలసిన శివ మంత్రమును జపించలేదు. శ్రీ మహాదేవా! శంభో! నా అపరాధమును క్షమించుము.

తండ్రీ! నిరంతరము జపించవలసిన శివ నామమును ఏనాడూ ధ్యానించలేదు. ఏపాటి దానములూ చేయలేదు. లక్షలాది బీజ మంత్రములతో కూడిన హోమములను ఆచరించలేదు. పవిత్ర గంగా తీరమునందు నిష్ఠతో పూజలు, వ్రతములు సల్పలేదు. ఓ మహాదేవా! శంభో! నా అపరాధమును మన్నించి క్షమింపుము.

09. నగ్నో నిఃసంగ శుద్ధ స్త్రిగుణ విరహితో
ధ్వస్తమోహాన్ధకారో
నాసాగ్రేన్యస్త దృష్టి ర్విదిత భవగుణో
నైవ దృష్టః కదాచిత్।
ఉన్మన్యావస్థయా త్వాం విగతగతిమతిః
శంకరం న స్మరామి
క్షన్తవ్యో మేఽపరాధః శివ శివ శివ భోః
శ్రీ మహాదేవ శంభో॥

ఓ శివా! నగ్నమైనవాడు, సంసార బంధములు తొలిగినవాడు, సత్వ రజస్తమో గుణములు లేనివాడు, అజ్ఞానాంధకారము నశించినవాడు, ముక్కు చివర దృష్టిని కేంద్రీకరించి తపస్సు చేయువాడు, సంసార మందలి గుణముల నెరిగిన వాడు నాకెప్పుడూ కనబడలేదు. ఉన్మాదావస్థతో మతి చలించిన వాడనై నిన్ను స్మరించలేదు. శ్రీ మహాదేవా! శంభో! నా అపరాధమును క్షమించుము.

తండ్రీ! సంసార బంధములను త్యజించి, నగ్న స్వరూపుడై త్రిగుణాతీతుడై, అజ్ఞాన తిమిరమును తొలగించుకుని, నాసాగ్రమున దృష్టి నిలిపి తప మాచరించు వాడు నాకు దర్శనమీయలేదు. నేను ఈ సంసారమనే ఉన్మాదములో పడి నీ నామమును మరిచాను. ఓ శంభో, ఓ మహాదేవా! నా అపరాధమును మన్నించి క్షమింపుము.

10. స్థిత్వా స్థానే సరోజే ప్రణవమయ
మరుత్కుంభితే సూక్ష్మమార్గే
శాన్తే స్వాన్తే ప్రలీనే ప్రకటితవిభవే
దివ్యరూపే శివాఖ్యే।
లింగాగ్రే బ్రహ్మవాక్యే సకలతనుగతం శంకరం న స్మరామి
క్షన్తవ్యో మేఽపరాధః శివ శివ శివ భోః
శ్రీ మహాదేవ శంభో॥

ఓ శివా! సహస్రార పద్మము నందు నిలచి ప్రణవమయమైన వాయువుచే కుంభితమైన సూక్ష్మ మార్గము నందు ప్రశాంతమగు మనస్సును విలీనము చేసినచో శివుడను పేరుకల నీ దివ్య రూపము యొక్క వైభవము తెలియును. లింగమునందు, వేదవాక్యమునందు సకల జీవరాసుల యందు నిండి ఉన్న శంకరుని నేను స్మరించలేదు. శ్రీ మహాదేవా! శంభో! నా అపరాధమును క్షమించుము.

ఓంకారముచే కుంభించిన నాడులలో సహస్రార చక్రమునకు చేరి మనసును ఏకాగ్ర పరచి నట్లయితే ఈశ్వరుడనే నీ రూపము సాక్షాత్కరించి ఉండేది. లింగ రూపమై, వేదరూపమై వెలసి ఉన్న నిన్ను నే నసలు తలచనే లేదు. ఓ మహాదేవా! శంభో! నా అపరాధమును మన్నించి క్షమింపుము.

11. హృద్యం వేదాన్తవేద్యం
హృదయసరసిజే దీప్తముద్యత్ప్రకాశం
సత్యం శాన్తస్వరూపం సకలమునిమనః
పద్మషణ్డైక వేద్యమ్।
జాగ్రత్స్వప్నే సుషుప్తౌ త్రిగుణ విరహితం
శంకరం న స్మరామి
క్షన్తవ్యో మేఽ పరాధః శివ శివ శివ భోః
శ్రీ మహాదేవ శంభో॥

ఓ శివా! మనోహరుడవు, వేదాంతముచే తెలియబడువాడవు, హృదయ పద్మము నందు వెలుగొందుచున్నవాడవు. ప్రకాశవంతుడవు, సత్యము, శాంతము అగు స్వరూపము కలవాడవు. సకల మునుల హృదయ ప్రద్మము లందున్న వాడవు, సత్త్వ రజ స్తమో గుణములు లేని వాడవు అగు నిన్ను మెలకువ యందు కానీ, గాఢ నిద్ర యందు కానీ ఎన్నడూ స్మరించ లేదు. శ్రీ మహాదేవా! శంభో! నా అపరాధమును క్షమించుము.

ఈశ్వరా! మనోహర రూపుడవు, వేదములచే మాత్రమే తెలియబడువాడవు, నా హృదయమనే పద్మములో ప్రకాశముగా జ్వలిస్తున్నవాడవు, సత్య శాంత స్వరూపుడవు, మునుల హృదయ వాసివి, త్రిగుణాతీతుడవు అయిన నిన్ను మెలకువలో కానీ నిద్రలో కానీ స్మరించనే లేదు. ఓ మహాదేవా! శంభో! నా అపరాధమును మన్నించి క్షమింపుము.

12. చంద్రోద్భాసిత శేఖరే స్మరహరే గంగాధరే శంకరే
సర్పైర్భూషిత కంఠకర్ణవివరే నేత్రోత్థ వైశ్వానరే।
దన్తిత్వక్కృత సున్దరామ్బరధరే త్రైలోక్యసారే హరే
మోక్షార్థం కురు చిత్త వృత్తిమమలా మన్యైస్తు కిం కర్మభిః॥

చంద్రుడు తలపై ప్రకాశించు చున్నవాడు, మన్మథుని సంహరించిన వాడు, గంగను ధరించినవాడు, శుభము చేయువాడు, మెడలోనూ చెవులయందు సర్పాభరణములను ధరించినవాడు, కంటియందు మండుచున్న అగ్ని కలవాడు, ఏనుగు చర్మము చుట్టుకున్నవాడు, మూడులోకములకు సారమైనవాడు అగు శివుని యందు ఓ చిత్తమా! మోక్షము కొరకై నిష్కల్మషముగా ప్రవర్తించుము. వేరు కర్మలతో ఏమి ప్రయోజనము?

చంద్రుని సిగలో ధరించినవాడు, మన్మధ సంహారి, గంగను జటలో ధరించినవాడు, శుభంకరుడు, గళమునందు, కర్ణములకు నాగాభరణ భూషితుడు, జ్వలించు చున్న నేత్రము కలవాడు, గజ చర్మధారి అయిన ఈశ్వరుని, ఓ మనసా మోక్షమును కోరి ప్రార్థించుము. ఇది తప్ప వేరు కర్మలతో ఎటువంటి ప్రయోజనము లేదు.

13. కిం యానేన ధనేన వాజికరిభిః ప్రాప్తేన రాజ్యేన కిం
కిం వా పుత్ర కళత్రమిత్ర పశుభి ర్దేహేన గేహేన కిమ్।
జ్ఞాత్వై తత్క్షణభంగురం సపది రే త్యాజ్యం
మనో దూరతః
స్వాత్మార్థం గురువాక్యతో భజ (భజ)మన
శ్రీపార్వతీ వల్లభమ్॥

కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్
Kiron Type Institute

వాహనముతో, ధనముతో గుఱ్ఱములతో, ఏనుగులతో, అధికారముతో, పుత్రులతో, భార్యతో, మిత్రులతో, పశువులతో, శరీరముతో, ఇంటితో ఏమి ప్రయోజనము? ఇదంతా క్షణములో నశించి పోవునని తెలుసుకుని ఓ మనసా! వీటిని దూరంగా వదలి పెట్టుము. ఆత్మలాభము కొరకై గురూపదేశము ద్వారా శ్రీపార్వతీ వల్లభుని సేవించుము.

వాహనములు, ఐశ్వర్యము, అశ్వములు, గజములు, అధికారము, దారా పుత్రాదులు, మిత్రులు, పశువులు, శరీరము, గృహము వీటితో ఏ ప్రయోజనము లేదు. ఇవి క్షణికములు. నశించి పోవునవి. అందుకని ఓ మనసా, వీటిని వదలి, గురూపదేశమును పొంది, పార్వతీనాథుని సేవింపుము.

14. పౌరోహిత్యం రజనిచరితం గ్రామణీత్వం నియోగో
మాఠాపత్యం హ్యనృతవచనం సాక్షివాదః పరాన్న మ్।
బ్రహ్మద్వేషః ఖలజనరతిః ప్రాణినాం నిర్దయత్వం
మా భూదేవం మమ పశుపతే జన్మ జన్మాన్తరేషు॥

పౌరోహిత్యము, రాత్రి సంచారము, గ్రామాధికారిగా ఉండుట, నౌకరీ చేయుట, మఠాధిపతిగా వ్యవహరించుట, అబద్ధములాడుట, సాక్ష్యము పలుకుట, పరాన్నము భుజించుట, వేదములను ద్వేషించుట, దుష్టులతో సహవాసము, ప్రాణుల పట్ల దయ లేకుండుట – అనునవి ఓ పశుపతీ! నాకు జన్మ జన్మాంతరము లందు కలుగకుండు గాక!

పౌరోహిత్యము, రాత్రి వేళలలో సంచరించుట, గ్రామాధికారి పదవి, నౌకరీ చేయుట, మఠాధిపత్యము, అబద్ధము పలుకుట, సాక్ష్యము చెప్పుట, ఇతరుల అన్నమును భుజించుట, ఆగమములను ద్వేషించుట, చెడు సహవాసములు, జీవుల పట్ల నిర్దయ నాకు ఏ జన్మములోను కలుగ కుండుగాక.

15. ఆయుర్నశ్యతి పశ్యతాం ప్రతిదినం
యాతి క్షయం యౌవనం
ప్రత్యాయాన్తి గతాః పునర్న దివసాః
కాలో జగద్భక్షకః।
లక్ష్మీ స్తోయత రఙ్గభఙ్గచపలా విద్యుచ్చలం జీవితం
తస్మాన్మాం శరణాగతం కరుణయా త్వం రక్ష రక్షాధునా॥

చూచుచుండగానే ఆయువు నశించు చున్నది. ప్రతిదినమూ యవ్వనము క్షీణించు చున్నది. గడచిన రోజులు మరల తిరిగి రావు. కాలము లోకమును భక్షించుచున్నది. నీటి అలల వలే లక్ష్మి (సంపద) చపలమైనది. మెరుపు వలే జీవితం చంచలమైనది. కనుక శరణాగతుడనైన నన్ను కరుణతో నీవే ఇప్పుడు రక్షించుము.

తండ్రీ! చూస్తూ చూస్తూ ఉండగానే, నా అయుక్షీణమగుచున్నది. దినము గడుస్తున్న కొలదీ నా యవ్వనము తరిగిపోతున్నది. కాలము గడచిపోతూ, గతించిన క్షణములను తిరిగి రాకుండా చేస్తున్నది. చంచలమైన లక్ష్మి తరిగి పోవుచున్నది. కనీసము ఇప్పుడైనా నిన్ను శరణు వేడిన నన్ను కరుణించి రక్షింపుము.

// ఇతి శ్రీ శంకరాచార్య విరచిత "శివ అపరాధ క్షమాపణా స్తోత్రమ్" సంపూర్ణమ్ //

– – – = – – –

కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్



Kiron Type Institute